సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 5 । మార్చి । 2024



స్పందన అర్జీలకు..

8లో

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన-జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 293 అర్జీలు స్వీకరించారు.



అప్పన్నకు ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.



రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.లక్ష్మిని వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. – విశాఖ సిటీ

న్యూస్‌రీల్

రూ.90 లక్షలతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం



ఎంపీ సత్యవతిని శాలువాతో సత్కరిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: జిల్లాలో నూతనంగా ప్రభుత్వ గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు రూ.90 లక్షల సీఎస్సార్ నిధులతో కోల్ ఇండియా ముందుకు రావడం శుభపరిణామమని జిల్లా జేసీఏ గ్రంథాలయాల సభ్యుడు, సిద్ధార్థ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. జాతీయ రహదారి కొత్తూరులో శంకుస్థాపన చేయడం ఆనందదాయకమన్నారు. ఇందుకు కృషి చేసిన ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతిని ఆమె కార్యాలయంలో గ్రంథాలయాల సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో సత్కరించారు. భవన నిర్మాణపనులు త్వరలో ప్రారంభమవుతాయని, పోటీ పరీక్షలకు చదువుకునే నిరుద్యోగ యువతీ యువకులకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ భవనం పూర్తయిన వెంటనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వసతులను గ్రంథాలయంలో ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

వెంకన్న ఆలయానికి ఆనంద్ రూ.20 లక్షల విరాళం



వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.20 లక్షల చెక్కు అందజేస్తున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

మునగపాక: ఇక్కడ నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ వ్యక్తిగతంగా రూ.20 లక్షల విరాళం అందజేశారు. పలువురు దాతలు ఆలయ నిర్మాణానికి ముందుకొస్తున్న నేపథ్యంలో కమిటీ సభ్యులకు చెక్కును అందజేసి ఉదారత చాటుకున్నారు. ఆలయ నిర్మాణం విషయంలో రాజీ పడవద్దన్నారు. తన వంతు సహకారాన్ని ఆలయ అభివృద్ధికి అందజేస్తానన్నారు. ఆనంద్‌కుమార్‌ను కలిసిన వారిలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి కాశీబాబు, పెంటకోట ఉమేష్, ఆడారి లక్ష్మణరావు, చంద్రపాటి లోకేష్‌కుమార్ తదితరులున్నారు.

ఒడిశా కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు



ఒడిశా కార్మికుల పిల్లలతో ఎక్స్‌టర్నల్ మానిటర్ డాక్టర్ విజయశాంతి

కశింకోట: హైరిస్కు ప్రాంతాల్లో నివసించే పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఎక్స్‌టర్నల్ మానిటర్ డాక్టర్ విజయశాంతి సిబ్బందికి సూచించారు. కశింకోటలోని శారదానది అవతల హైరిస్కు ప్రాంతమైన ఇటుకల బట్టీల్లో పని చేస్తున్న ఒడిశా కార్మికుల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఇక్కడ ఎంత మంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారు? వారందరికీ పోలియో చుక్కలు వేశారా? లేదా? అని ఆరా తీశారు. పోలియో చుక్కలు వేసినట్లు గుర్తులు వారి తాత్కాలిక నివాస ఇళ్లపై ఉన్నాయో? లేదో? పరిశీలన చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ వద్ద ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమం తీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య ప్రాజెక్టు అధికారి జగదీష్, విస్తరణాధికారి సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు సుభాని, హనుమంతరావు, మునిలినాయుడు పాల్గొన్నారు.

నేడు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ ప్రారంభం

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయం వెనుక రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను మంగళవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కాంప్లెక్స్‌లోనే ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొని వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర వాటిని ఒకే కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నగరానికి చేరుకున్న మంత్రి ఒక హోటల్‌లో బస చేశారు.

విశ్వవ్యాప్తం.. విశాఖ వైభవం



- నగరాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విజన్
- వాణిజ్య, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న ముఖ్యమంత్రి
- ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో నిర్వహణ
- స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహణపై సీఎం సమక్షంలో ఎంవోయూలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం.. పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. విశాఖలో ఇతర పరిశ్రమలకూ ఆస్కారం ఉందన్న ఆలోచన దిగ్గజ పారిశ్రామికవేత్తల మదిలో కలిగేలా.. విశాఖను గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో విశ్వవ్యాప్తంగా ప్రమోట్ చేశారు. అందుకే.. దిగ్గజ పారిశ్రామికవేత్తలు వైజాగ్‌కు క్యూ కట్టారు. భవిష్యత్తులో విశాఖ వైభవాన్ని విశ్వం వినువీధుల్లో ప్రతిబింబించేలా సమగ్ర కార్యాచరణను అమలు చేసే ప్రణాళికలతో సీఎం వైఎస్ జగన్ ముందుకొస్తున్నారు. వాణిజ్యవేత్తలు, పారిశ్రామిక ప్రతినిధులతో ఏపీ డెవలప్‌మెంట్ డైలాగ్ పేరుతో విజన్ విశాఖ సదస్సులో పాల్గొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో నడిచేలా విశాఖను నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సైతం అడుగులు పడుతున్నాయి.

విజన్ వైజాగ్ పేరుతో..

పరిశ్రమలకు పట్టుగొమ్మగా.. ఉపాధి కల్పనకు ఆలంబనగా.. పెట్టుబడులకు స్వర్గధామంగా.. అంతర్జాతీయ నగరంగా భాసిల్లుతున్న విశాఖ.. భవిష్యత్తులో మరింత గొప్పగా అభివృద్ధి చెందేందుకు ఉన్న వనరులేంటి..? వాటిని ఎలా వినియోగించుకోవాలి.. ప్రపంచ పటంలో విశాఖని ఎలా నిలబెట్టాలనే సంకల్పంతో విజన్ వైజాగ్ కాన్సెప్ట్‌తో సీఎం వస్తున్నారు. ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖపట్నం వైపు చూసేలా చేసింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. ఇప్పటికే పలుమార్లు నివాస యోగ్యమైన నగరంగానూ... వ్యాపారానికి అనువైన నగరాల్లో విశాఖపట్నం చరిత్రకెక్కింది. సరికొత్త విశాఖ ఆవిష్కృతమయేలా.. పరిశ్రమలు, పర్యాటకం, హాస్పిటల్స్, హోటల్స్, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు చెందిన సుమారు 2000 మందితో సీఎం చర్చించనున్నారు. విశాఖపట్నం విజన్ డాక్యుమెంటును ముఖ్యమంత్రి వివరించనున్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలలో కల్పించిన మౌలిక సదుపాయాల గురించి, విశాఖ నగరంలో పర్యాటక రంగానికి ఉన్న అవకాశాల గురించి వైఎస్ జగన్ సంభాషించనున్నారు.

విద్యార్థుల నైపుణ్యానికి 'భవిత'...

విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ.. రాష్ట్రంలోని విద్యార్థులు అంతర్జాతీయ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఇందుకోసం విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా విద్యార్థులు నైపుణ్య రంగంలో నిష్ణాతులుగా మారాలనీ.. విశాఖని స్కిల్ డెవలప్‌మెంట్‌కి కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మంగళవారం భవిత కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుడుతున్నారు. మధురవాడలోని వీ-కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన 8 స్కిల్ డెవలప్‌మెంట్ స్టాల్స్‌ని పరిశీలిస్తారు. అనంతరం పరిశ్రమల భాగస్వాములతో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 3 ఒప్పందాల్ని సీఎం సమక్షంలో కుదుర్చుకోనున్నారు.

ఈ సందర్భంగా స్కిల్‌లోగో, ఫ్లాగ్‌ని, స్కిల్ యాంథమ్‌ని, స్కిల్ యూనివర్స్ యాప్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, న్యూ స్కిల్స్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. నైపుణ్య శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతోనూ సీఎం మాట్లాడనున్నారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానంలో మంగళవారం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్ద చేరుకుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. 'విజన్..విశాఖ' పేరిట నిర్వహించే సదస్సులో వివిధ రంగాల వాణిజ్య, పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ 'భవిత స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో సమావేశమవుతారు. అనంతరం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకొని 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.

రూ.1500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాఖను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. నగర పర్యటనలో భాగంగా.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ఆవిష్కరణలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రూ.98 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సుమారు రూ.100 కోట్లతో ముడసర్లోవలో నిర్మించనున్న జీవీఎంసీ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తారు. రూ.10 కోట్లతో టర్టెల్ బీచ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు. వెంకోజీపాలెం నుంచి మారియట్ హోటల్ వరకు ఆల్టర్నేటివ్ డబుల్ రోడ్ నిర్మాణం, మధురవాడకు కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేయనున్న వాటర్ సప్లయ్ ప్రాజెక్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం తదితర ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు.

సీఎం సభకు గట్టి బందోబస్తు



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఎంపీ సత్యవతి



సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ మురళీకృష్ణ

- 7న పిసినికాడ సభలో 'చేయూత' నిధులు విడుదల చేయనున్న సీఎం వైఎస్ జగన్
- 1,500 మంది సిబ్బందితో భద్రతా చర్యలు
- నాలుగు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్
- ఏర్పాట్లు పరిశీలించిన డీఐజీ విశాల్ గున్ని

సాక్షి, అనకాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని తెలిపారు. అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో ఈ నెల 7న వైఎస్సార్ చేయూత చివరి విడత కార్యక్రమంలో సీఎం పాల్గొనున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఇక్కడ సభా ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా కశింకోట ఎంపీడీవో కార్యాలయం వద్ద హెలిప్యాడ్‌ను, సీఎం పర్యటన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు అనువుగా ఉండే ప్రదేశం పరిశీలించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండే విధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని సూచించారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి, బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చే పోలీసు అధికారులకు, సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పించడం గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డీఐజీ మీడియాతో మాట్లాడుతూ.. మూడు రోజులుగా సీఎం సభా స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని నిత్యం పహారా కాస్తున్నామన్నారు. 50 వేల మంది ప్రజలు సభకు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 1,500 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు నాలుగు ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ఒక్కొక్క ప్రదేశంలో 200 వాహనాలు పార్కింగ్ చేయొచ్చన్నారు. పిసినికాడ సమీపంలో జాతీయ రహదారిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సభ సమయంలో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు భారీ వాహనాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్‌ను మళ్లిస్తామన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.వి.జయభాస్కర్, డీఎస్పీ వి.సుబ్బరాజు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, ధనుంజయ్‌రావు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చకచకా ఏర్పాట్లు

అనకాపల్లి/కశింకోట: ఈనెల 7న ముఖ్యమంత్రి పాల్గొనే వైఎస్సార్ చేయూత సభ కోసం అనకాపల్లి మండలం పిసినికాడలో చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, ఎంపీ బి.వి.సత్యవతితో కలిసి సభాస్థలిని సోమవారం పరిశీలించారు. జిల్లా ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా అనకాపల్లికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలకాలని మంత్రి కోరారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు. కలెక్టర్, డీఐజీ విశాల్ గున్ని, ఎస్పీ మురళీకృష్ణ కశింకోట మండల పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, సీఐ వినోద్‌బాబు, ఎంపీడీవో కె. శేషుబాబు, తహసీల్దార్ ఎల్ మధుసూదన్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశం రేపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటలకు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 68 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వీటిలో ప్రధానంగా జోన్-2 పరిధి 13వ వార్డు ముడసర్లోవ నర్సరీ పార్కులో పిల్లల ఆట స్థలంలో మౌలిక సదుపాయాలు, సివిల్ వర్క్స్ చేసేందుకు, హనుమంతువాక వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు, జోన్-2 పరిధి 8వ వార్డు తారకరామనగర్ శాటిలైట్ టౌన్, రుషికొండ లే అవుట్ ఓపెన్ స్పేస్‌లో పార్క్ అభివృద్ధి, గాజువాక 67వ వార్డు జోగవానిపాలెం నుంచి శంకర్‌నగర్ వరకు వీఆర్‌సీసీ కాలువ నిర్మాణం, కూర్మన్నపాలెం వుడా ఫేజ్-2 ఖాళీ స్థలంలో పార్క్ అభివృద్ధికి సంబంధించి అంశాలు చర్చకు రానున్నాయి.

పీలా.. ఎందుకిలా..?

- అనుచరులతో పూజలు, టికెట్ కేటాయించాలన్న డిమాండ్లు
- కొణతాలతో కలిసి పనిచేస్తానన్నది ఒట్టి మాటేనా?
- అనకాపల్లి సీటు పీలా గోవిందకేనని అనుచరుల డిమాండ్
- జనసేనకు మద్దతిచ్చేది లేదంటున్న టీడీపీ దిగువస్థాయి శ్రేణులు

అనకాపల్లి: ముందు భగ్గుమన్నారు.. కొణతాల భేటీతో సర్దుకున్నారు.. కలిసి పనిచేస్తామని చెప్పారు.. కానీ చాప కింద నీరులా తన వర్గీయులతో పూజలు, నిరసన కార్యక్రమాలు చేయిస్తున్నారు.. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తీరు అంతుబట్టడం లేదని టీడీపీ-జనసేన శ్రేణులే చెవులు కొరుక్కుంటున్నారు. అనకాపల్లి అసెంబ్లీ టికెట్ జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణకు ప్రకటించడంతో టీడీపీ నేతలు.. ముఖ్యంగా పీలా వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోయారు. తీవ్ర స్థాయిలో నిరసనలు వ్యక్తం చేశారు. పార్టీని వీడాలన్న డిమాండ్ కూడా గట్టిగా వినిపించింది. పుండు మీద కారం జల్లినట్టు.. కొణతాల పీలా గోవిందును కలిసి మద్దతు కోరడం అటుంచి తన వద్దకు రమ్మని కబురు చేశారు. దీంతో గోవింద వర్గీయులు కోపంతో రగిలిపోయారు.

ఇంతలో కొణతాల గోవింద వద్దకు వచ్చి కలవడంతో పరిస్థితి సద్దుమణిగినట్టు కనిపించింది. ఇంతలో పీలా అనుచరులు గోవిందకే టికెట్ కేటాయించాలన్న డిమాండ్‌ను మళ్లీ బయటకు తీశారు. దిబ్బపాలెం రామాలయంలో పీలా గోవిందుకు టికెట్ రావాలని పూజలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టారు. వేటజంగాలపాలెంలో పడమటమ్మ తల్లిని కూడా దర్శించుకొని పూజలు జరిపారు. దీని భావమేమి తిరుమలేశా.. అంటూ జనసేన శ్రేణులు జుత్తు పీక్కుంటున్నారు. ఒకవైపు కలుస్తున్నట్టు కనిపిస్తూ.. మరోవైపు ఈ బిల్డప్‌లు ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

పీలా గోవిందుకు తెలియకుండానే ఇదంతా జరుగుతుందా అని మథనపడుతున్నారు. ఎందుకీ డబుల్ గేమ్ అని నిలదీస్తున్నారు. టీడీపీ సహకారం లేకపోతే కనీసం పరువు నిలిచే స్థాయిలోనైనా ఓట్లు రాలవన్న భయం వారికి పట్టుకుంది. చివరకు ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో, వీఆర్‌ఏ

- అడంగల్ సవరణ కోసం రూ.8 వేల డిమాండ్
- నాతవరం తహసీల్దారు కార్యాలయంలో పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో సింహాచలం, వీఆర్‌ఏ లోవరాజు



వివరాలు తెలుపుతున్న ఏసీబీ డీఎస్పీ రమ్య

నాతవరం: ఏసీబీ అధికారులకు గుమ్మడిగొండ వీఆర్వో, వీఆర్‌ఏ చిక్కారు. జిరాయితీ భూమి అడంగల్ సవరణ కోసం లంచం డిమాండ్ చేసిన వీరిని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వలవేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. గుమ్మడిగొండకు చెందిన అడిగర్ల వంశీకృష్ణ తన తండ్రి పేరు మీద ఉన్న 2 ఎకరాల 18 సెంట్ల జిరాయితీ భూమి అడంగల్ సవరణ కోసం మ్యూటేషన్ చేయాలని ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నాడు. దీని కోసం వీఆర్వో జుర్రా సింహాచలం, వీఆర్‌ఏ చేవళ్ల లోవరాజు రూ.30 వేలు డిమాండ్ చేశారు. అంత డబ్బులు ఇవ్వలేనని బాధితుడు ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. చివరికి రూ.8 వేలు ఇస్తానని విన్నవించాడు. దానికి వారు అంగీకరించారు. అయితే ఏడాదిగా తనను తిప్పించుకుంటూ తీవ్ర మానసిక ఇబ్బందులు పెట్టడంతో బాధితుడు రెండు రోజుల క్రితం ఏసీబీ 14400 కాల్ సెంటరును ఆశ్రయించాడు. ఈ మేరకు సోమవారం సాయంత్రం బాధితుడు వంశీకృష్ణ నుంచి ఇక్కడ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో రూ.6 వేలు, వీఆర్‌ఏ రూ.2 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణ అనంతరం ఇద్దరిపై కేసు నమోదు చేసి అవినీతి నిరోధక శాఖ న్యాయస్థానంలో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపారు. ఈ దాడిలో సీఐలు ప్రేమ్‌కుమార్, విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, శ్రీనివాస్‌కుమార్, కిశోర్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వరుసగా రెవెన్యూ శాఖపై దాడులు: మండలంలో కొంతకాలంగా రెవెన్యూ శాఖ అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినా వారిలో మార్పు రావడం లేదు. ఐదు నెలల క్రితం పి.కె.గూడెం వీఆర్వో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆ సంఘటన మరవక ముందే ప్రస్తుతం గుమ్మడిగొండలో వీఆర్వో, వీఆర్‌ఏ లంచం తీసుకుంటూ పట్టుబడటంతో మండలంలో ఈ ఘటన చర్చనీయాంశమైంది. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కూడా ఏసీబీ అధికారులకు పట్టుబడటం గమనార్హం. శృంగవరం, చెర్లోపాలెం వీఆర్వోలు, ఎం.బెన్నవరంలో పని చేసే ఇద్దరు వీఆర్వోలు సైతం ఏసీబీకి చిక్కారు. ఇతర శాఖల కంటే కేవలం రెవెన్యూ శాఖ పని తీరు ఇంత అధ్వానంగా తయారు కావడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

త్యాగరాజులమేనా?

- అన్నకే దిక్కులేదు.. మేమెంత? అంటూ నిర్వేదం
- విశాఖ దక్షిణ, గాజువాక, భీమిలి ఆశావహుల్లో అలజడి
- నాగబాబుకు ఝలక్‌తో పత్తా లేని సుందరపు బ్రదర్స్
- ఇప్పటికే జాడలేకుండా పోయిన జనసేన సీనియర్లు



సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన శ్రేణుల్లో సరికొత్త అలజడి రేగుతోంది. ఇప్పటికే టీడీపీతో పొత్తులో అరకొర సీట్ల కేటాయింపు వీరికి మింగుడు పడడంలేదు. చాలీచాలని సీట్లతో ఎవరికి ఎసరు వస్తుందోనని లోలోన ఆందోళన చెందుతున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి తానే బరిలో ఉంటున్నానని, అచ్యుతాపురంలో కాపురం కూడా పెట్టి నానా హంగామా చేసిన నాగబాబు.. పక్షం రోజులు తిరక్కుండానే తట్టాబుట్టా సర్దుకుని పలాయనం చిత్తగించారు. ఊహించని ఈ పరిణామానికి జనసేన క్యాడరులో ఒక్కసారిగా షాక్‌కు గురైంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సొంత సోదరునికే ఈ పరిస్థితి వస్తే ఇక మేమెంత? అంటూ పార్టీలో టిక్కెట్లను ఆశిస్తున్న వారు నిర్వేదంలో పడిపోయారు. ఇన్నాళ్లు పార్టీలో నాగబాబుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని భావించిన వారికి ఆయనకు అంత సీను లేదని తేటతెల్లమైంది. నిజంగా జనసేనలో పట్టున్నా, లేక పవన్ కల్యాణ్ వద్ద పలుకుబడి ఉన్నా నాగబాబుకు ఈ పరిస్థితి వచ్చేది కాదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. స్వయంగా అన్నకే పార్టీలో దిక్కు లేదని, ఇక ఆయనను నమ్ముకుంటే తాము నట్టేట మునిగినట్టేనని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నాగబాబుకు అన్ని విధాలా దన్నుగా నిలిచి, ఆయన వ్యవహారాలు చూస్తున్న యలమంచిలి ప్రాంతానికి చెందిన సుందరపు బ్రదర్స్ (విజయ్‌కుమార్, సతీష్‌కుమార్) సైతం నాగబాబు ఎపిసోడ్‌తో పత్తాలేకుండా పోయారు. మునుపటిలా జనంలో తిరగడం లేదు. వాస్తవానికి వీరిలో విజయకుమార్ యలమంచిలి, సతీష్‌కుమార్ గాజువాక సీట్లను ఆశిస్తున్నారు. ఇందుకోసం వీరు నాగబాబును ప్రసన్నం చేసుకుంటూ అటు అనకాపల్లి జిల్లాలోను, ఇటు విశాఖపట్నం జిల్లాలోనూ వార్తల్లో వ్యక్తులుగా నిలిచారు. నాగబాబు మనుషులుగా ముద్ర వేయించుకున్న వీరు కొంతమంది నుంచి వసూళ్లకు దిగారన్న ఆరోపణలున్నాయి. నాగబాబు తాజా పరిస్థితితో వీరు ఆందోళన చెందుతున్నట్టు చెబుతున్నారు.

త్యాగాలకు సిద్ధంకండి..

మరోవైపు భీమిలి జనసేన సీటు తనకే ఖాయమైందని బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్న పంచకర్ల సందీప్‌కు కాకుండా టీడీపీకి కేటాయిస్తున్నట్టు ప్రచారం ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జోరందుకుంది. ఈ సారి ఈ సీటును త్యాగం చేయాలని అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సందీప్‌కు స్పష్టం చేసినట్టు తెలిసింది. అలాగే గాజువాక స్థానం నుంచి తమ అభ్యర్థే బరిలో ఉంటారన్న ప్రచారాన్ని టీడీపీ నేతలు విస్తృతం చేశారు. దీంతో అక్కడ జనసేన సీటును ఆశిస్తున్న సుందరపు సతీష్‌కుమార్, కోన తాతారావులు కూడా త్యాగాలు చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఇక జనసేన నుంచి విశాఖ దక్షిణ సీటును వంశీకృష్ణ శ్రీనివాస్, సాధిక్, ప్రసాదరెడ్డి, కందుల నాగరాజు, డాక్టర్ మూగి శ్రీనివాసరావులు ఆశిస్తున్నారు. ఈ స్థానం నుంచి కూడా టీడీపీ అభ్యర్థే పోటీ చేస్తారని తెలియడంతో వీరంతా కలవరం చెందుతున్నారు.

ఆ ఇద్దరిలో ఒక్కరికే చాన్స్?

ఇక ఎమ్మెల్యే టిక్కెట్టును ఆశించి వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌లు జంప్ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో వీరిలో ఒక్కరికే జనసేన సీటు దక్కవచ్చని చెబుతున్నారు. పెందుర్తి స్థానం పంచకర్లకు దాదాపు ఖరారైందని చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే వంశీకృష్ణకు మొండి చెయ్యే గతయ్యే పరిస్థితి తలెత్తనుంది. అదే జరిగితే జనసేన త్యాగరాజుల జాబితాలో ఆయన కూడా చేరిపోనున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న కీలకనేతలు తమకు గుర్తింపు లేదని, నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఇవ్వడం వంటి పరిణామాలతో ఇప్పటికే జాడలేకుండా పోయారు. ఇప్పుడు వీరికి త్యాగమూర్తులు కూడా తోడయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 47 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు

అనకాపల్లి : చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 47 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో వచ్చిన ఫిర్యాదులపై ఆయా స్టేషన్ల అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్‌లు వంటి వాటిపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



చిన్న పిల్లల వార్డులో ఐసీయూ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సోమవారం పరిశీలించారు. చిన్న పిల్లల అవసరాల నిమిత్తం ఆధునికీకరిస్తున్న ఐసీయూ వార్డు రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడ కల్పిస్తున్న మౌలిక వసతులపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్ ఓపీ గేట్ వద్ద జరుగుతున్న ఆర్చ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నకు మరో షాక్

- ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో పార్టీలో చేరిన అగ్రహారం గ్రామస్తులు



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో పార్టీలో చేరిన అప్పలనాయుడు దంపతులు, ఇతర నాయకులు

నర్సీపట్నం: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడుకు మరో షాక్ తలిగింది. నారా లోకేష్ ముందు భుజాలు ఎగరేసిన అయ్యన్నపాత్రుడికి భంగపాటు ఎదురైంది. నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన నాతవరం, మండలం, ఆర్.పి.అగ్రహారానికి చెందిన గుడపర్తి అప్పలనాయుడు, లోవరత్నం దంపతులు, శ్రీరామ్మూర్తి, నాగేశ్వరరావు, సత్తిబాబు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గత నెల 20న నర్సీపట్నంలో జరిగిన యువగళం కార్యక్రమానికి విచ్చేసిన నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. అధినాయకుడు మెప్పుకోసం అగ్రహారం వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడుతో పాటు అనుచరులను టీడీపీలో చేర్చారు. 10 రోజులు గడవక కుండానే అప్పలనాయుడు అనుచరులతో ఎమ్మెల్యే సమక్షంలో సొంతగూటికి చేరుకున్నారు. గ్రామస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చి టీడీపీ కండువాలు కప్పిన వారంతా తిరిగి సొంతగూటికి చేరుతున్నారు. ఇటీవల గొలుగొండ మండలం, నాగపురంలో టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్టు ప్రచారం చేసుకున్నారు. ఈ సంఘటన మరువక ముందే లోకేష్ సమక్షంలో చేరిన అగ్రహారం గ్రామస్తులు తిరిగి సొంత గూటికి చేరి, అయ్యన్నపాత్రుడు, నారా లోకేష్‌కు ఝలక్ ఇచ్చారు.

తిరిగి నా కుటుంబంలోకి వచ్చా...

ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో తిరిగి పార్టీలో చేరడం సంతోషంగా ఉందని గుడపర్తి అప్పలనాయుడు పేర్కొన్నారు. తొందరపాటు నిర్ణయంతో టీడీపీలో చేరాను. ఇష్టపూర్వకంగా తాను పార్టీలో చేరలేదన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గణేష్ నాయకత్వం అంటే తనకు చాలా ఇష్టం అన్నారు. పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎంపీపీ సాగిన లక్ష్మణ్ మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వర రావు, పార్టీ నాయకులు ఉన్నారు.

స్పందన అర్జీలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి

- అధికారులకు జేసీ ఆదేశం
- కలెక్టరేట్‌లో స్పందనకు 293 అర్జీలు



స్పందన అర్జీలు స్వీకరిస్తున్న జేసీ జాహ్నవి

తుమ్మపాల : స్పందన కార్యక్రమంలో సమర్పించే దరఖాస్తులకు స్పష్టమైన సమాధానాలివ్వాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన-జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులకు వేగంగా పరిష్కారం చేయాలన్నారు. ఫిర్యాదు తిరస్కరణ గూర్చిన కారణాలను వివరంగా తెలియజేయాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఆర్‌ఓ బి.దయానిధి, కెఆర్‌సిసి ఉపకలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, భూసర్వే సహాయ సంచాలకులు ఎస్.గోపాలరాజ దరఖాస్తులు స్వీకరించారు. ఈరోజు స్పందన కార్యక్రమానికి 293 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో బిజెఆర్. సుజల స్రవంతి ఎస్‌డీసీ కె.రమామణి, డీపీవో ఆర్.శిరీషారాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, సీపీవో జి.రామారావు, విద్యుత్ శాఖ ఈఈ. రాజశేఖర్, డీఎస్‌ఓ. కె.వి.ఎల్.ఎస్.మూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నుంచి రక్షణ కల్పించండి....

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డీపట్టా భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తూ మాపై దాడికి ప్రయత్నిస్తున్న పాయకరావుపేట మండలం కేశవనగరం రెవెన్యూ వెంకటనగరం సర్పంచ్, ఇతర నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వజ్జ అనురాధ తదితరులు స్పందనలో ఫిర్యాదు చేశారు. కేశవరం సర్వే నెం .144-2, 4, 3, 145-1,2,4,129-1 మొత్తం 26 ఎకరాల భూమి ప్రభుత్వం గతంలో ఇచ్చిందని, రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారని, సదరు భూమిలో జీడి మామిడి పంట సాగుచేసుకుంటున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు పొక్లెయిన్‌తో తమ భూమిలో తోటను ధ్వంసం చేసి తీరని నష్టం కలిగించారని, మండల స్థాయిలో ఫిర్యాదు చేసినప్పటికీ పరిష్కారం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

దివ్యాంగుల జీవనోపాధికి భవనాన్ని కేటాయించండి

దివ్యాంగుల జీవనోపాధికి, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు మాకవరపాలెంలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కేటాయించాలని దివ్యాంగుల మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన చేసి స్పందనలో వినతి అందించారు. 150 మంది దివ్యాంగులతో ప్రభుత్వ ప్రోత్సాహంతో సంస్థగా ఏర్పడి ఇప్పటికే పలు చిరువ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, ఎల్ఈడీ బల్బులు, డీటీపీ, మసాల దినుసులు ప్యాకింగ్ వంటి యూనిట్లు పెట్టుకొనుటకు స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిరువ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయం అద్దెలకే సరిపోతుందని, 20 ఏళ్ల క్రితం ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన భవనాన్ని తార అనే స్వచ్ఛంద సంస్థ కొన్నాళ్లపాటు నిర్వహించి వదిలేయడంతో పదేళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. దివ్యాంగులను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి సారించి భవనాన్ని కేటాయించాలని కోరారు.

వడ్డీ, ష్యూరిటీ లేని రుణం కోసం వినతి

ఐదేళ్లగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా కనీసం పట్టించుకోలేదని, దివ్యాంగుల కోటాలో కనీసం ప్రైవేటు సెక్టార్‌లో కూడా ఉపాధి కల్పించేందుకు అధికారులు కృషి చేయలేదని, బ్యాంకుల్లో ష్యూరిటీ, వడ్డీ లేని రుణాలైన మంజూరు చేయాలని రాపేటి భాస్కరరావు స్పందనలో కోరారు. ఏదైనా వ్యాపారం చేసుకోవడానికి పెట్టుబడి సహాయంగా బ్యాంకు రుణం ఇప్పించాలని కోరారు.

వీవోఏల సమస్యలపై వినతి

వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జిల్లా వీవోఏలు నిరసన తెలిపారు. వీవోఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి, శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామ సంఘాల నుంచి నెలకు రూ.2వేల వేతనం చెల్లించాలని, గ్రూపు బీమా, సీబీటీహెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. బకాయిలను తక్షణమే చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా మంజూరు చేయడంతో పాటు గుర్తింపు కార్డులు, యూనిఫారం అందించాలన్నారు.

దేవరాపల్లికి తలమానికంగా ఆడిటోరియం నిర్మాణం



దేవరాపల్లిలో ఆడిటోరియం, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- రూ. 90 లక్షలతో ఆడిటోరియం, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ

దేవరాపల్లి : దేవరాపల్లికి తలమానికంగా నిలిచేలా ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లిలో ఉమామహేశ్వరీదేవి అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రూ. 90 లక్షలతో ఆడిటోరియం, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా సీఎం జగన్ సహకారంతో దేవరాపల్లిలో రూ.46 కోట్లతో తారురోడ్లు, సీసీ రోడ్లు, ఇంటింటికీ కుళాయిలు, డ్రైనేజీలు, ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధి, ఆహ్లాదకర పార్కు నిర్మాణం, ప్రధాన రోడ్లు విస్తరణ తదితర అభివృద్ధి పనులు చేపట్టి దేవరాపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. ఈ ఆడిటోరియం అందుబాటులోకి వస్తే వివాహాలు ఇతర శుభ కార్యాలు, సభలు, సమావేశాలకు చక్కని వేదిక సమకూరుతుందని స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఎల్లేటి కరుణాకర్‌రావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, గొర్లె సన్యాసినాయుడు, దీవి శంకర్, సోమిరెడ్డి పేరునాయుడు, గుల్లిపల్లి మురళి, చల్లా తాతయ్యలు, వి.లలితాప్రసాద్, సబ్బవరపు మాలిబాబు, పరవాడ రవి తదితర నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం జగన్ విజన్‌తో గ్రామాల్లో శాశ్వత అభివృద్ధి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- కొట్నాబిల్లిలో ఆర్‌బీకే భవనానికి ప్రారంభోత్సవం



ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించిన విప్ ధర్మశ్రీ

రావికమతం : ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి విజన్‌తో గ్రామాల్లో రూ.కోట్లాది నిధులు వెచ్చించి శాశ్వత అభివృద్ధి, మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని కొట్నాబిల్లిలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నాడు చంద్రబాబు హయాంలో విత్తనాలు,ఎరువుల కోసం రావికమతం వెళ్లాల్సి వచ్చేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి సచివాలయాలను అందుబాటులోకి తెచ్చి పనులన్నీ గ్రామంలోనే చేయిస్తూ ఆర్‌బీకేతో రైతులకు అన్నీ అందుబాటులోకి తెచ్చారన్నారు. వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌తో గ్రామంలోనే వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారని, వాటికి నూతన భవనాలను సైతం రూ.కోట్లు వెచ్చించి నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, ఆ గ్రామ సర్పంచ్ సీతాదేవి, మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ మత్స భవానిప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సన్యాసినాయుడు, బంటు శ్రీను పాల్గొన్నారు.

వలంటీర్ సేవకు సలామ్..



విశాఖ కేజీహెచ్ ఆస్పత్రిలో శంకరావుకు పింఛన్ అందిస్తున్న లక్కవరం వలంటీర్ శ్రీనివాసరావు



విశాఖలో మంగరత్నంకు పింఛను నగదు అందజేస్తున్న కొత్తపెంట వలంటీర్ భానుతేజ

చోడవరం : ప్రభుత్వం తమపై ఎంతో నమ్మకంతో ఉంచిన బాధ్యతను వలంటీర్లు ఎంతో అంకిత భావంతో పనిచేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి పింఛన్, ఇతర ప్రభుత్వ పథకాలు ఇవ్వడమే కాకుండా కష్టాల్లో ఉన్న వారికి మేమున్నామన్న భరోసా కల్పిస్తున్నారు. లక్కవరం గ్రామానికి చేసిన బండారు శంకరరావు అనే వికలాంగుడికి కొద్ది రోజులుగా అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్ అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు వికలాంగ పింఛన్ ప్రతి నెలా వస్తుంది. ఈనెల ఆస్పత్రిలో ఆయన ఉన్నారు. ఈ పరిస్థితిలో ఆయనకు ప్రభుత్వ తరపున మేమున్నామని ఆ ప్రాంత వలంటీర్ కుబిరెడ్డి శ్రీనువాసరావు మానవత్వంతో వ్యవహరించారు. సొంతఖర్చుతో నేరుగా కేజీహెచ్ ఆస్పత్రికి సోమవారం వెళ్లి పింఛను డబ్బు అందజేశారు.

కాకినాడ వెళ్లి...

యలమంచిలి రూరల్: రేగుపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు పిల్లి అప్పలనర్స అనారోగ్యంతో కాకినాడలో ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జై తన బంధువుల ఇంట్లో ఉంటోంది.ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ కొల్లి రామలక్ష్మి వృద్ధురాలికి మార్చి నెల పింఛన్ అందించడానికి సోమవారం సుమారు 120 కిలోమీటర్లు దూరం ప్రయాణించి కాకినాడలో ఉంటున్న అప్పలనర్స వద్దకు వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు. ఈ పరిస్థితిలో పింఛన్ తనకు ఎంతో ఉపయోగపడుతుందని,సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ను తన వద్దకే పంపించి పింఛన్ అందజేసినందుకు ఎంతో



కాకినాడలో అప్పలనర్సకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రామలక్ష్మి

రుణపడి ఉంటామని వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు

ఆస్పత్రిలో బాసటగా...

దేవరాపల్లి : కొత్తపెంట గ్రామానికి చెందిన మునుబర్తి మంగరత్నం గుండె సంబంధిత అనారోగ్య సమస్యతో విశాఖపట్నంలోని మెడికవర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ సూరెడ్డి భానుతేజ సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి మంగరత్నంకు పింఛను సొమ్ము అందజేసి బాసటగా నిలిచారు. సేవా భావంతో పని చేసిన వలంటీర్ సూరెడ్డి భానుతేజను స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు అభినందించారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



విప్ ధర్మశ్రీ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు, మహిళలు

రావికమతం : కొట్నాబిల్లి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 40 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో సోమవారం వైఎస్ఆర్‌సీపీలో చేరారు. చేరిన వారిలో ఆ గ్రామానికి చెందిన అచ్చెమ్మ, అప్పారావు, కొనతల అర్జున, అప్పలకొండ, పార్వతమ్మ వారి కుటుంబ సభ్యులు చేరారు. ధర్మశ్రీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న వైనాన్ని వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ మత్స భవానీ ప్రసాద్, సర్పంచ్ బొంతు సీతా దేవి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

శారదానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట : కశింకోటలోని శారదానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం రాత్రి పోలీసులు కనుగొన్నారు. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని సీఐ ఎం.వినోద్‌బాబు పరిశీలించారు. నది ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొని వచ్చి మృతదేహం ఒడ్డుకు చేరినట్టు ఈ సందర్భంగా తెలిపారు. మృతదేహాన్ని చేపలు తినడం, ఎక్కువ రోజులు నీటిలో ఉండడం వల్ల ముఖం గుర్తు పట్టడానికి వీలులేని విధంగా ఉందన్నారు. మృతి చెంది ఎక్కువ రోజులు అయి ఉంటుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కాగా మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



వెంకటలక్ష్మి మృతదేహం

రాంబిల్లి: కొత్తూరు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్రి వెంకటలక్ష్మి(32) అనే వివాహిత అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ ఎస్.లక్ష్మణరావు అందించిన వివరాలివి. అచ్యుతాపురం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన కర్రి శివ, అతని భార్య వెంకటలక్ష్మి టీవీఎస్ ఎక్సెల్ బండిపై మామిడివాడలో గల తమ పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ బండి బోల్తా పడింది. దీంతో రోడ్డుపై పడిపోయిన వెంకటలక్ష్మిని టిప్పర్ ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో భర్త శివకు స్వల్ప గాయాలు తగిలాయి. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



పట్టాలపై మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

యలమంచిలి : తురంగలపాలెం రైల్వే అండర్ పాస్ వంతెన, జంపపాలెం సమీపంలో సోమవారం గుర్తు తెలియని రైలు వృద్ధుడిని ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలు ప్రకారం యలమంచిలి మండలం జంపపాలెం గ్రామానికి చెందిన రైతు వెలగా దాసు (71) తురంగల పాలెం రైల్వే అండర్ పాస్ వద్ద జంపపాలెంలో రెల్వేట్రాక్ దగ్గరలో ఉన్న పొలంలోకి పట్టాలు దాటి ఇంటికి వెళుతుండగా అనకాపల్లి నుంచి తుని వైపుగా వెళుతున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని భార్య, ముగ్గురు కుమారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని రైల్వే ఎస్ఐ తెలిపారు.

యూకలిప్టస్ తోటలు దగ్ధం



పిల్లవానిపాలెంలో తోటలో చెలరేగిన మంటలు

రావికమతం : పిల్లవానిపాలెం గ్రామానికి చెందిన బర్నికాల సూర్యనారాయణ, పిల్లా రామకృష్ణకు చెందిన నీలగిరి తోటల్లో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. దారిన పోయే వారెవరో కాల్చిన సిగరెట్‌ను ఆర్పకుండా విసిరేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. మధ్యాహ్న సమయంలో గాలి వీయడంతో మంటలు తోటంతా జోరుగా వ్యాపించాయని ఈ ప్రమాదంలో తమకు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. రావికమతం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మరింత ప్రమాదం జరగకుండా రక్షించారు. లేకుంటే మరో పదెకరాల్లోని తోటలకు మంటలు వ్యాపించి ఉండేవని సమీప రైతులు పేర్కొన్నారు.



మంటల్లో కాలిపోయిన యూకలిప్టస్ తోట చిరికివానిపాలెంలో...

కె.కోటపాడు : వారాడ శివారు చిరికివానిపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో యూకలిప్టస్ తోటలు కాలిపోయాయి. చిరికివానిపాలెం, వి.సంతపాలెం గ్రామాలకు చెందిన చిరికి సన్యాసినాయుడు, వేచలపు సింహాద్రప్పడుతో పాటు మరో ఐదుగురు రైతులకు చెందిన యూకలిప్టస్ తోటలు కాలిపోయినట్టు స్థానికులు తెలిపారు. అగ్ని ప్రమాదం సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో వాటిల్లిన నష్టానికి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చర్యలను తీసుకోవాలని సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి అధికారులను కోరారు.

పంచాయతీలకు ఆర్థిక దన్ను


పిసినికాడ గ్రామ సచివాలయం

- 15వ ఆర్థిక సంఘం రెండో దశ నిధుల విడుదల
- అనకాపల్లి మండలానికి రూ.1.78 కోట్ల మంజూరు
- గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు
- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా పనులు




తుమ్మపాల మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి(యలమంచిలి రూరల్): పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా అభివద్ధికి నోచుకోని పల్లెల రూపురేఖలు నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో మారుతున్నాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు చేపట్టే అవకాశం వచ్చింది.

రెండో దశల్లో రూ.2.85 కోట్లు

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా అనకాపల్లి మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం రెండు దశల్లో రూ.2.85 కోట్ల నిధులను విడుదల చేసింది. గ్రామ పంచాయతీల ఖాతాలకు ప్రభుత్వం నేరుగా జమ చేసింది. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) ద్వారా నిధులు జమయ్యాయి. ఈ నిధులను గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతోపాటు పారిశుధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపులు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా, సిబ్బంది జీత భత్యాలు తదితరాలకు వాడుకోవచ్చు.

అభివృద్ధి పనుల్లో వేగం

గ్రామ పంచాయతీలతోపాటు మండల పరిషత్తులకు కూడా 15వ ఆర్థిక సంఘం నిధులు ఖాతాల్లో జమయ్యాయి. అనకాపల్లి మండలానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరం రెండో దశ నిధులు రూ.1.78 కోట్లు మంజూరయ్యాయి. తొలి దశలో ఇది వరకే సుమారుగా రూ.1.07 కోట్లు జమయ్యాయి. వచ్చే రెండు నెలల్లో మండలంలోని అన్ని పంచాయతీలకు మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ నిధులు అందుబాటులోకి వస్తే పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతోనూ అభివద్ధి పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం మంజూరైన నిధుల ఖర్చులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

పంచాయతీల అభివృద్ధికి ఊతం



రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడతాయి. ఈ నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. నిధుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. ప్రాధాన్యతా మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– కె.ధర్మారావు, ఈవోపీఆర్డీ, అనకాపల్లి

సీఎంకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు



గ్రామ పంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం హర్షణీయం. వేసవి సమీపిస్తున్న తరుణంలో నిధులు రావడం వల్ల గ్రామ పంచాయతీల్లో పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న అత్యవసర పనులు చేపట్టడానికి వీలుంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– పలకా భాగ్యలక్ష్మి, సర్పంచ్, సత్యనారాయణపురం

క్లుప్తంగా

నేడు మారేడుపూడిలో 'ఆరోగ్య సురక్ష' శిబిరం

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కె.షమీమ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, గర్భిణీ వైద్యురాలు, కంటి వైదుడు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ పౌష్టిక ఆహార ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం పరిధిలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా వైద్యం అందించి, మందులు పంపిణీ చేస్తామన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు తాళ్లపాలెం విద్యార్థి


లక్ష్మణ షణ్ముఖను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గాయత్రి స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి టి.లక్ష్మణ షణ్ముఖ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖకు చెందిన విశ్వం ఎడ్యుటిక్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ నెల 10న విజయవాడలో జరగనున్న ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్‌ఎం వై.నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థి షణ్ముఖను కరస్పాండెంట్, హెచ్ఎంలతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

తగ్గిన టమాటా, ఉల్లి ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.30 ఉండగా.. ఈ వారం రూ.20కు అమ్మకాలు జరిగాయి. ఉల్లిపాయ రూ.30 నుంచి రూ.25కు తగ్గింది. బంగాళాదుంప రూ.30, దొండకాయ, బరబాటి, వంకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, చేమ దుంప, కాకరకాయ రూ.60, బీరకాయ, బెండకాయ, క్యాప్సికం, చిక్కుడు, గోరు చిక్కుడు రూ.80కు విక్రయించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 8,987 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,640	4,304
మొదటి రకం	3,620	4,200
రెండో రకం	3,380	3,750
మూడోరకం	3,300	3,510

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్ వాలెంటైన్	:	సత్యనారాయణ స్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థ రాయ్	:	షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
వ్యూహం	:	వేంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
చారి 111	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–26 యూనిట్లు, ఓ పాజిటివ్–3 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 427 మంది గ్యాస్ బుక్‌చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

2 షెడ్ల నిర్మాణానికి రూ.10 లక్షల మంజూరు


ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీసూర్యనారాయణ ఆలయ కమిటీ సభ్యులు

తుమ్మపాల: జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెం శ్రీసూర్యనారాయణమూర్తి ఆలయ ప్రాంగణంలోని పాలూరి సూర్యప్రకాశరావు ఫంక్షన్ హాలు వద్ద శుభకార్యాలకు సరిపడా రెండు షెడ్ల నిర్మాణానికి ఎంపీ బీవీ సత్యవతి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు కమిటీ తరఫున సోమవారం ఎంపీ నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. సమీప గ్రామాలైన రాజుపాలెం, ఎరుకువానిపాలెం, గొర్లివానిపాలెం, వల్లూరు, కొత్తూరు, సిరసపల్లి గ్రామాల ప్రజలకు ఈ షెడ్లు ఉపయోగపడతాయని చెప్పారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, గొల్లవిల్లి రామకృష్ణప్రసాద్, గొల్లవిల్లి నర్సింగరావు, బండారు వెంకటరమణ, గొల్లవిల్లి చిరంజీవి, గొల్లవిల్లి రవికుమార్, బండారు రమణ, గొల్లవిల్లి వాసు, గొల్లవిల్లి త్రినాథ్, గుర్రం సత్యారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అత్యవసర సమావేశం నేడు

కశింకోట: వైఎస్సార్‌సీపీ మండల అత్యవసర సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కశింకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిసినికాడ వద్ద జరగనున్న బహిరంగ సభకు రానున్న నేపథ్యంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ తదితరులు పాల్గొంటారన్నారు. సీఎం పర్యటన అంశంపై చర్చించనున్నట్లు చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

మహాశివరాత్రికి సకల ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8న మహాశివరాత్రి రోజు తెల్లవారుజాము నుంచి లింగోద్భవ కాలం రాత్రి 12 గంటల వరకు స్వామికి అభిషేకాలతోపాటు శాంతి హోమాలు, శివనామ సంకీర్తన ఏకాహం, పసుపు కుంకుమ నోములు జరుగుతాయన్నారు. రాత్రి జాగరణలో శివనామంతో భక్తిగీతాలు, ఆర్కెస్ట్రా, కోలాటాలు, విద్యుద్దీపత్‌కాంతులతోపాటు బాణసంచా విన్యాసాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో రావణ వాహనంపై శివతాండవ మూర్తి సెట్ ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే క్యూలైన్‌లతోపాటు బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణ, ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, పాలకవర్గ సభ్యులు కాంద్రేగుల రాము, కొణతాల అప్పాజీ త్రినాథరావు, సింగంపల్లి రాజేశ్వరి, నాగరాజు, మెలిపాక దుర్గా, ఈశ్వరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పోలీస్ బలగాల కవాతు


ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధుల నేపథ్యంలో జిల్లా కేంద్రం అనకాపల్లిలో సోమవారం కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు, సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీబీ పాటిల్ బందాలు పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం కవాతు చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరరావు, ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్, రిజర్వ్ ఆర్ఎస్ఐ భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎస్ఎస్ఎస్ అధికారుల సేవలు

రానున్న ఎన్నికల్లో సేవలందించేందుకు 20 మంది ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈమేరకు సోమవారం స్థానిక పట్టణ పోలీస్ అతిథి గృహంలో జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణను కలిశారు. ఎన్నికల విధులు నిర్వహించే ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారులకు రవాణ, భోజనం సమకూర్చడంతోపాటు గౌరవ వేతనం కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు అందజేస్తామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్బీ డీఎస్పీ బి.అప్పారావు, డీసీఆర్‌బీ సీఐ లక్ష్మణమూర్తి, ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు, ఎస్బీ సీఐ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


డిపో మేనేజర్ సుజాతకు డిపో నూతన కమిటీ వివరాలు అందజేస్తున్న సత్యనారాయణ

అనకాపల్లి: ఆర్టీసీ అనకాపల్లి డిపో జైభీమ్ అసోసియేషన్ డిపో అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో డిపో కార్యదర్శిగా ఎబి.రాజు, కోశాధికారిగా ఎస్.కె.రాజుతో పాటు 8 మంది కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఎస్ఎస్ నారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికై న అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కమిటీ రెండేళ్ల పాటు పదవిలో ఉంటుందన్నారు. డిపోలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన కమిటీ వివరాలను డిపో మేనేజర్ ఎస్.సుజాతకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో యువకుల చేరిక


పార్టీలో చేరిన యువకులతో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులై మండలంలో మొండిపాలెం గ్రామానికి చెందిన క్రాంతికుమార్‌తో పాటు మరో 15 మంది యువకులు వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు–2 వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో పార్టీలో సోమవారం చేరారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆ గ్రామంలో వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రాజు, శివ, హరీష్, మోహన్, రమేష్, మోహన్‌రావు, శ్రీను, చిన్నారావుతో పాటు మరో ఆరుగురు చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శూలాల సంబరం

నక్కపల్లి: మండల కేంద్రంలో శూలాల సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భద్రావతి సమేత భావనారుషి కల్యాణోత్సవాలల్లో భాగంగా సోమవారం సాయంత్రం నుంచి నక్కపల్లిలో నేల వేషాలు ప్రభల ఊరేగింపు నిర్వహించారు. యువత డాన్సులతో సందడి చేశారు. ఆలయం వద్ద పూజారి పత్రి పూజ నిర్వహించారు. పత్రి తెచ్చే సమయంలో భక్తులపై నీళ్ల చల్లుతూ ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి శూలాల సంబరం జరుగుతుందని తెల్లవార్లు భక్తులు నాలుకపై శూలాలు గుచ్చుకుని సంబరం నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

తాళ్లపాలెం వారపు సంత కళకళ


తాళ్లపాలెం వారపు సంతలో గొర్రెల అమ్మకాలు


సంతలో విక్రయిస్తున్న మేకలు


వ్యాన్లలో తరలిస్తున్న మేకలు, గొర్రెలు

- జోరుగా గొర్రెలు, మేకల విక్రయాలు
- వ్యాపారులు, పెంపకందారుల్లో ఆనందం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం నుంచి గొర్రెలు, మేకల అమ్మకాలు జోరందుకున్నాయి. ఇప్పటి వరకు సీజన్ కాకపోవడంతో వీటి విక్రయాలు అంతంత మాత్రంగా జరిగేవి. ఇప్పుడు పండగలు, ఉత్సవాల సీజన్ కావడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో గొర్రెలు, మేకలతో సంత కళకళలాడింది. తాళ్లపాలెం వారపు సంతకు ఉభయ విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు అమ్మకానికి వస్తుంటాయి. మహాశివరాత్రి నుంచి జూన్ వరకు, దసరా రోజుల్లో ఎక్కువగా విక్రయిస్తుంటారు. ఆయా రోజుల్లో పండగలు, ఉత్సవాలు, వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. దీంతో వీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో గొర్రెలు, మేకల అమ్మకాలు ఎక్కువగా సాగుతుంటాయి.

వివిధ ప్రాంతాల నుంచి సంతకు..

మహాశివ రాత్రి సమీపించడంతో గొర్రెలు, మేకల అమ్మకాలు ఎక్కువగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి పెంపకందారులు, రైతులు ఎక్కువగా వీటిని అమ్మకానికి వ్యాన్లు, ఆటోల్లో తీసుకొచ్చారు. పరిమాణం అనుసరించి ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు సాగాయి. విశాఖ, గాజువాక, యలమంచిలి, అనకాపల్లి, తుని, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు, హోటళ్ల నిర్వాహకులు, ప్రజలు వచ్చి కొనుగోలు చేశారు. సుమారు వెయ్యి వరకు అమ్మకానికి వచ్చాయి. జోరుగా విక్రయాలు సాగడంతో వ్యాపారులు, పెంపకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీజన్ ప్రారంభం



తాళ్లపాలెం వారపు సంతలో గొర్రెలు, మేకల అమ్మకాల సీజన్ ప్రారంభమైంది. ఏటా లానే మహాశివరాత్రి నుంచి జూన్ వరకు అమ్మకాలు ముమ్మరంగా సాగనున్నాయి. ఉత్సవాలు, పండగలు, వివాహాలు వగైరా కార్యాలు జరగనున్నందున వీటి అమ్మకాలు ఊపందుకున్నాయి.

– నమ్మి అప్పలనాయుడు, మాకవరపాలెం

భద్రతకు ప్రాధాన్యం


భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో 53వ జాతీయ భద్రత దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్, టౌన్‌షిప్ నివాసితులతో ప్రాజెక్టు హెడ్ సిన్హా సేఫ్టీ వాక్ నిర్వహించి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సేఫ్టీ పార్క్‌లో జెండాను ఆవిష్కరించారు. ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ పర్యావరణం, పాలన శ్రేష్టత కోసం కాంట్రాక్టు కార్మికులకు దిశానిర్దేశం చేశారు. కాంట్రాక్టు కార్మికులంతా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రత సంస్కృతిని మెరుగుపర్చడానికి ప్రవర్తన ఆధారిత భద్రతను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నక్కపల్లి ఆస్పత్రిలో త్వరలో ట్రామాకేర్ సెంటర్

- రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

నక్కపల్లి : తాను రాజ్యసభ సభ్యుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే మొట్ట మొదటగా నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో ట్రామా కేర్‌సెంటరు ఏర్పాటు చేయిస్తానని రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నక్కపల్లి, కోటవురట్ల 30 పడకల ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు రూ.6 కోట్లు మంజూరు చేయించి అదనపు భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించామన్నారు. గతంలో అయితే వైద్యులే ఉండేవారు కారన్నారు. ఈ ఆస్పత్రిలో గైనిక్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్ వంటి వైద్యనిపుణులను నియమించి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఈ ఆస్పత్రి పరిధిలో సుమారు 30 కిలోమీటర్ల జాతీయరహదారి ఉండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు క్షతగాత్రులవుతున్నారన్నారు. అత్యవసర వైద్యం అందక మరణిస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఎంపీ డాక్టర్ సత్యవతి ద్వారా ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. తాను ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాజ్యసభలో ఈ విషయం ప్రస్తావించి ట్రామాకేర్ సెంటరు ఏర్పాటు చేయిస్తానన్నారు. అనంతరం ఆస్పత్రికి అవసరమైన పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఆయన కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కంబాల జోగులు, కాపుకార్పోరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని వినతి

అనకాపల్లి: జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్, స్వీపర్స్‌గా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.11,500 చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కేఎస్ఆర్ పేట డీఈవో కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆడారి రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను శుభ్రపరిచే వారిని కార్మికులు, ఆయాలుగా కాకుండా స్కావెంజర్స్, స్వీపర్స్‌గా గుర్తించాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనమివ్వాలని, విద్యార్థుల సంఖ్యకు అణుగుణంగా ఆయాల సంఖ్యను పెంచాలని తదితర డిమాండ్లు చేశారు. ఏఐటీయూసీ నాయకులు వెంటనాయడు, వాయిబోయిన శేఖర్, రవి కుమార్, రాము పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా.. మహిళలకు వరం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు జగన్

మునగపాక : వైఎస్సార్ ఆసరాతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్ తెలిపారు. తిమ్మరాజుపేట రామాలయం ప్రాంగణంలో సోమవారం రాత్రి డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా మహిళలకు వరంగా మారిందన్నారు. ఎన్నికల ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలన్నారు. సమావేశంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు,పార్టీ నేతలు ఆడారి వెంకట గణేష్, శరగడం రామభద్రనాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.